# రాధచేసినగమ్మత్తు

రచన : రా. న. వర్మ

'ఎవరా సోగకనుల సొగసు మితారి' గద్దించింది రాధ. 'నామాట విను రాధా' ప్రాథేయపడ్డాను. 'మాటలు కట్టి పెట్టి వచ్చినదారిపట్టు' అంది. 'వినవా' అన్నా 'వినను వినను' అంటూ తలుపు మొహంమీద దభాల్ని మూసేసింది. ఎదురింటి రేడియో 'బ్రతుకు స్వప్నము కాదు పండు పున్నమి కాదు' అని పాడుతున్నట్లనిపించింది.

కొత్తగా హెడ్డాఫీసునుండి వచ్చిన మేనేజరు సుదర్శనరావుగారు నన్ను పిలిపించి 'నరేంద్రనాథ్ ! పింజరపోలు కింద తయారయిన ఈ ఆఫీసులో పనికొచ్చేవాడివి నీవొకడివి కన్పడుతున్నావ్. పనికొచ్చే కుర్రాళ్లనీ పైకి తీసుకరావడం నాపద్ధతి. వచ్చేనెలనుంచి నిన్ను ఆఫీసర్‌గా ప్రమోట్‌చేస్తున్నాను' అని శెలవిచ్చి బాతాఖానీ మొదలెట్టారు. మాటల సందర్భంలో మా మేనమామగారి కూతురు రాధను త్వరలో పెళ్లిచేసుకోబోతున్నానని చెప్పాను. 'అలానా' అన్నారు సుదర్శనరావుగారు అదోలా మొహంపెడ్తూ. ఇక లేవబోతూంటే 'నరేంద్రనాథ్ పైకి రావలసినవాడివి అంచేత చెప్తున్నాను. నువ్వు ప్రస్తుతం 24 గంటలూ పనిమీద మనస్సుంచాలి. ఇప్పుడు పెళ్ళాడావంటే సంసారం బాదరబందీ అంతా మెడకు చుట్టుకుని పనిమీద శ్రద్ధ తగ్గిపోతుంది. తరువాత ఆఫీసరు భార్యంటే ఎన్నో క్వాలిఫికేషన్లుండాలి. మన మేనేజింగు డైరెక్టరు గారే తనిఖీకి వచ్చారనుకో వారిని కనీసం టీకైనా మీ యింటికి పిలవాలా ? మరప్పుడు నీ భార్య ఏలాంటిదై యుండాలి? చక్కగా బెదరకుండా, నవ్వుతూ చలాకీగా నడచుకోగలిగిందవ్వాలంటావా? ఇంకో చిన్నవిషయం: మన యం. డి. గారికి రాష్ట్రాంతర వివాహాలంటే ఎంతో సరదా. మోహనరావుని ఎరుగుదువా అన్నారు సుదర్శనరావుగారు.

'ఎరుగుదును'అన్నాను. 'అతనిప్పుడు బ్రాంచి మేనేజరు తెలుసా?' అన్నారు సుదర్శనరావుగారు. 'అదృష్టవంతుడు' అన్నా. 'కాదు తెలివైనవాడు'. 'బియ్యే చదివిన బెంగాల్ అమ్మాయిని పెళ్ళాడాడు. మేనేజింగుడైరెక్టరు బెనర్జీబాబు సుముహూర్తానికి విచ్చేసారు. రెండు నెలలు తిరక్కముందు మోహనరావు బ్రాంచిమేనేజరైకూర్చున్నాడు' అన్నారు.

ఆఫీసు విడిచాక మలబార్‌లో కూర్చుని ఆలోచించాను. సుదర్శనరావుగారు చెప్పింది సబబుగానే అవుపించింది. మరో సంవత్సరం ఓపికపట్టితే రాధ బియ్యే పరీక్షకెళ్ళుతుంది. నాకూ కాస్త ఉద్యోగంలో అనుభవం హెచ్చుతుంది. ప్రస్తుతానికి శుభకార్యాన్ని వాయిదా వేయడమే ఉత్తమంగా అవుపించింది. అయితే ఈమాట రాధతో చెప్పడం ఏలా ? నిదానంగా రాధ ఇంటికి దారితీశాను. క్లాక్‌టవర్ చూస్తే ఏడు గంటలైంది. రాధను సినిమాకు తీసికెళ్తానని చెప్పినమాట జ్ఞాపకమొచ్చింది. మాంఛి టెంపర్‌లో వుంటుంది. అదీ ఒక మంచికే అనుకుంటూ రాధయింటి మెట్లెక్కాను. రాధనాన్న రామారావు గారు హాల్లో కూర్చోనున్నారు. 'రావోయ్! నరేంద్రా. రాధా ! నరేంద్రా వచ్చాడు' అని కేకేసారో లేదో రెండేసిమెట్లు లేడిపిల్లలా గెంతుతూ రాధ వచ్చేసింది.

'సినిమాకు తీసికెళ్తానన్న పెద్దమనిషేనా' అంది.

'రాధా! అత్తయ్యకు ఉబుసం ఏలాగుంది' అన్నా.

'ఏమిటండోయ్! అసందర్భ ప్రేలాపన? సినిమాకు తీసికెళ్లుతానని ఏడు గంటలకివచ్చి కనీసం 'సారీ' అనకుండా అత్తయ్యకుబ్బసం ఏలాగుందంటావేమిటి' అంది రాధ.

'పాపం ఏదైనా ఆయుర్వేద వైద్యం చేయించినా బావుండును' అన్నా.

రాధ కళ్లసలే పెద్దవి. ప్రస్తుతం అవి కేవలం గుడ్లగూబకళ్లే గుర్తుకొచ్చాయి.

'ఓహో! పైత్యంప్రకోపించినట్లుందే. అబ్బాయిగారు పిచ్చికుదరందే పెళ్లి కుదరదన్న సామెత విన్నట్లు లేరు' అంది.

మించిననూ సమయము దొరకదు అనుకుని 'ఇప్పుడు పెండ్లికొచ్చిన తొందరేమితే' అన్న. రాధ ఒక్క నిమిషం కళ్ళార్పకుండా నా కళ్ళలోకి చూచి 'ఎవరా సోగకనుల సొగసు మితారి' అంది. ఎంత వేగిరపాటు!! పెళ్లి కాస్త వాయిదావేయడం మంచిదని ధ్వనించీ ధ్వనించకముందే ఏదో కథ ఉందనీ, ఎవతో ప్రతినాయకి వుందనీ' ఎందుకనుకోవాలీ ? ఆడవారి మాటలికీ అర్థాలు లేవులే అనుకుని రూముకెళ్లిపోయాను. మరునాటినించీ ఇరవై నాలుగ్గంటలూ

పనిమీదే మనస్సుంచడం అలవాటు చేసుకోవడం మొదలెట్టాను.

వారం రోజులయ్యాక నల్లచెరువు మెట్టలవైపు షైరువెళ్ళుతుంటే దుమ్ము లేపుకుంటూ ఓకారు నా ముందాగింది. 'రావోయ్ నరేంద్రా' అంటూ సుదర్శనరావుగారు తలుపు తీశారు. లోపల రాధ కూర్చొమంది. 'వీరు కుమారి రాధాదేవిగారు. వీరి నాన్నగారు మా బావ పెదనాన్నగారు ప్రాణస్నేహితులు' అంటూ పరిచయం చేయబోయారు. కేవలం అపరచితురాలులా రాధ 'నమస్తే' అంది.

మర్నాడు రామారావుగారితో వయస్సొచ్చిన ఆడపిల్లను పరాయి పురుషులతో, వాళ్లెంత మర్యాదస్తులైనా సరే ఎంత పాతస్నేహితుల బంధువులైనా సరే, విచ్చలవిడిగా తిరగనివ్వడం చాల పొరబాటని చెప్పెయ్యాలని వెళ్లాను. రామారావు లేరు. రాధ హాల్లో జడల్లుకుంటూంది. 'నమస్తే మిస్టర్ నరేంద్రా దయచేయండి' అంది. మిలమిలా మెరసే ఆ పెద్దకళ్ళు చూస్తే సామో పొయమే ఉత్తమమనిపించింది. 'రాధా! సాయంత్రం సినిమాకెళ్దామా' అన్నాను.

'సార్ వేరే ఎంగేజ్‌మెంటుందండీ'

'చాల్లెద్దూ కబుర్లు' అన్నా.

'సాయంత్రం మీబాస్ సుదర్శనరావుగారు సినిమాకు తీసికెళ్తామన్నారు'అంది.

'ఇదుగో! రాధా! నువ్విలా ఎవళ్లంటే వాళ్లతో తిరగడం నాకేమీ బావులేదు' అన్నా'

'అలాగా ఇక దయచెయ్యండి'అంది.

రెండోరోజు సుదర్శనరావుగారు పిలుస్తున్నారని బంట్రోతు ఆదినారాయణ చెప్పాడు. వీలైతే నాలుగుమాటలు అడిగేద్దామని కాలరుసర్దుకుని మరీవెళ్లాను. 'సాయంత్రం మెయిల్లో మేనేజింగు డైరెక్టరుగారబ్బాయి వస్తున్నాడు. వెళ్లి రిశీవ్ చేసుకో. నెలరోజులు మన బ్రాంచిలో పని నేర్చుకుంటారు. ఆయన బాధ్యత నీకు ఒప్పచెపుతున్నా' అన్నారు. ఇదీ ఒక మంచికే అనుకున్నా. మేనేజింగ్ డైరెక్టరుగారి అబ్బాయికి ఆముదంరాయడంలో నిమగ్నులైన సుదర్శనరావుగారికి రాధతో షైరెళ్లడానికి టైముండదుకదా.

మెయిల్లో దిగిన అబ్బాయి డిలీప్ క్రాపింగ్, రాజ్‌కపూర్ మీసాల్తో కాలేజీ కుర్రాడిలా వున్నాడు. ఓవర్‌బ్రిడ్జిమీద నుంచి వస్తూంటే రాధ ఎదురైంది. 'హల్లో! నరేంద్రా! ఎవరీ మిత్రుడు?' అంది. 'ఔరా! ఎంత విచ్చలవిడిగా తిరుగుతూంది?' అన్న ఆశ్చర్యంతో నాకు మాట పెగిలిందికాదు. ఇంతలో వాళ్లకి వాళ్లే పరిచయం చేసేసుకున్నారు. టాక్సీలో సామాను సర్దించి తిరిగిచూచేసరికి రాధా, బెనర్జీ జూనియరు తాపీగా వస్తున్నారు. 'నరేంద్రా! మీకు ఆఫీసులో అర్జంటుపనేమైనా ఉండొచ్చు. బెనర్జీ బాబుకు వారి బస నేను చూపుతాను మీరిక వెళ్లి పనిచూచుకోండి' అంది రాధ. 'ఔను! ఇక మీరువెళ్లి పనిచూచుకోండ'న్నాడు డిలీప్‌క్రాపింగ్ గుంటడు. మరుమాటాడక ఆఫీసు కెళ్ళిపోయాను. 'బెనర్జీగారబ్బాయిని ఎందుకు ఒంటరిగా విడచిపెట్టొచ్చావ్' అంటూ సుదర్శనరావుగారు కళ్ళుపెద్దవిచేశారు. 'నేను ఈ ఆఫీసులో అసిస్టెంటు మేనేజర్ని రిసెప్షనిస్టుని కాను' అన్నా. 'టిట్లాఘర్‌కు బదలీచేస్తేకాని అబ్బాయిపని తెలిసిరాదు' అని గొణిగారు సుదర్శనరావుగారు. 'ఏడ్చావులే' అని మనస్సులో అనుకుని గదిలోకెళ్ళిపోయాను.

తరువాత వారం రోజుల్ని తలచుకుంటే భయమేస్తుంది. ఆఫీసులో సుదర్శనరావుగారిని, బయట బెనర్జీ జూనియర్, రాధనీ చూచి మతిపోయేలాగనిపించింది. రాధను మరచిపోయేందుకు బ్రహ్మప్రయత్నంచేశాను. ఇంత చంచల చిత్తను పెండ్లాడితే ఏమాత్రం సుఖపడబోయేదీ జ్ఞాపకంచేసుకున్నా. ఏంలాభం కళ్ళుతెరచినా, కళ్ళుమూసినా కళ్ళముందు మెరసిపోయే రాధను మరచిపోవడం నా తరమా? మజ్నూకింద తయారౌతానేమో అన్న భయం పట్టుకుంది. శెలవుపెట్టి వైజాగు కెళ్ళాను.

తిరిగిరావడంతోటే ఇదేదో తేల్చుకుందామని రామారావుగారింటి కెళ్లాను. 'రావోయ్! నూరేళ్ళాయుస్సు. రేపురాత్రి భోజనానికి మీ యం. డి. బెనర్జీ వస్తున్నాడు. నువ్వూ రావాలోయ్ అన్నారు. బెనర్జీగారిని మీకెలా తెలుసు? అనడిగా.

బెనర్జీని తెలియడాని కేమిటోయ్. మనం బి. యన్. ఆర్. లో పనిచేసే రోజుల్లో, ఈయనగారు ఓ చిన్నకొట్టూ అదీ పెట్టుకి కాలక్షేపం చేస్తుండేవాడు. సాయంత్రమయ్యేసరికి చదరంగం ఆట్టానికి మనింట్లో తయారు. సరేలే యుద్ధమొచ్చాక ప్రతివాడూ ఓ లక్షాధికారై కూర్చున్నాడు. రేపురాత్రి భోజనానికి తప్పకుండా రావోయ్. రాధపెండ్లి అఫిషియల్‌గా అనౌన్స్‌చేస్తాను అని లోపలికి వెళ్ళిపోయారు.

భూమి సూర్యుడిచుట్టూ తిరగడం మానేసి నాచుట్టూ తిరుగుతున్నట్లనిపించింది. ఇంకేముంది రాష్ట్రేతర సంబంధాలంటే చెవికోసుసునే బెనర్జీ బాబు రాధనిచూచి ముచ్చట పడుంటారు. మేనెజింగు డైరెక్టరు ముద్దు కొడుక్కి కాదని తాబేదారుకు పిల్లనిచ్చేటంతటి పిచ్చివాడా రామారావుగారు. ఐతే నాకిస్తామన్న రాధని ఇంకొకడికి యిస్తామని అనౌన్సు చేసేపార్టీకి నన్ను

పిలవడానికి ఎన్నిదమ్ములుండాలి. లాడ్జికేలా చేరానో తెలియదు. పక్కమీద పడుకుని తలపగిలేలా ఆలోచించానే కాని, తరుణోపాయం దొరికింది కాదు. కాని, నిద్రపట్టి నేను పృధ్వీరాజునైనట్లు రామారావుగారు జయచంద్రుడైనట్లు కలొచ్చి దిగ్గున లేచాను. కానీ వాస్తవానికి మనకు పృధ్వీరాజుకున్న దమ్ములేవు ఉన్నా రాధ సంయుక్తపాత్ర ధరించేందుకు ఏమాత్రం ఒప్పుకోదు. రామారావుగారి డిన్నరుకు వెళ్లడానికి నిశ్చయించుకున్నాను. రాత్రి ఏడుగంటలకు రామారావుగారింటికి వెళ్ళాను. రాష్ట్రాంతర వివాహవాది, చదరంగక్రీడావినోది, మా మేనేజింగు డైరెక్టరూ అయిన బెనర్జీబాబూ, రామారావుగారూ చదరంగ మాడుతున్నారు. ఓమూల సుదర్శనరావుగారు, బెనర్జీ జూనియర్, రాధ కూర్చుని తెగ నవ్వుతున్నారు. ఒక్కరైనా నన్ను గమనించారుకాదు. 'నన్ను నిరసించువారి ఆనందమందు, నాకు భాగమ్ము వల దొక్కనాటికైన' అన్న వేదులవారి పద్యభాగాన్నివల్లించి వచ్చిన దారి పట్టుదామనుకునే సమయంలో రామారావుగారు తలెత్తి చూసారు. రావోయ్! అలా నిల్చుండిపోయా వేమిటి అన్నారు. దగ్గరసా వెళ్లి కూర్చున్నాను. బెనర్జీబాబూ! ఈయన నరేంద్రనాథ్. మీ కంపెనీబ్రాంచిలో అసిస్టెంటు మేనేజరుగా పనిచేస్తున్నాడు. వచ్చేనెల్లో రాధను ఈయనకిచ్చి వివాహ. చేయబోతున్నాం అన్నారు రామారావుగారు. ఆశ్చర్యంతో, ఆనందంతో, మాట పెగలక నిలబడిపోయాను. కంగ్రాచులేషన్స్ అంటూ బెనర్జీజూనియర్ తెగ గెంతుతున్నాడు. సుదర్శనరావుగారు నిదానంగా లేచివచ్చారు. టిట్లాఘర్‌లో కుటుంబంతో వుండడం చాలా కష్టం ్నరు. టిట్లాఘర్ ఊసెందుకయ్యా యిప్పుడు అన్నారు. వేరువేరు బ్రాంచీలలో పనిచేస్తేకాని అనుభవం రాదు. అందుకని నరేంద్రనాథ్‌ని వచ్చేనెల నుంచి టిట్లాఘర్‌కు మార్చాలనుకుంటున్నా అన్నాడు సుదర్శనరావుగారు.

ఛా! ఛా! ఆ దండకారణ్యంలో అమ్మాయి ఏలా వుంటుందో. అంతగా అనుభవం కావాలంటే కలకత్తాకు మార్చు, వాళ్ళ క్షేమసమాచారాలు నేనే ఓకంట చూస్తుంటాను అన్నారు బెనర్జీబాబు. ఇంతలో రాధకలుగచేసుకుంది. బెనర్జీబాబూ! వారిని టిట్లాఘర్‌కే బదిలీ చేయనీయండి, అన్ని పనులూ నేర్చుకోవడం వారి మంచికేకదా అంది. అది కాదు రాధ ఒంటరివాడైతే ఎక్కడంటే అక్కడే కాలక్షేపం చెయ్యొచ్చనుకో. మరి నువ్వో అన్నారు రామారావుగారు. అప్పుడు రాధ, సీత రాముడితో పద్నాలుగేళ్ళు వనవాసం చేయలేదా అంది. సెభాష్! రామారావ్ రాధ ఎంత చక్కగా మాట్లాడిందో చూశావా. నరేంద్రనాథ్! అదృష్టవంతుడివోయ్ అన్నారు బెనర్జీబాబు. నాకు ఏమనాలో బోధపడక ఊరుకున్నాను. ఇంతలో బెనర్జీబాబు సరేనమ్మా నీ వన్నట్లే ఓ రెండునెలలు టిట్లాఘర్‌లో ఉండనీయి. తరువాత కలకత్తాకు బదిలీచేస్తాను అన్నారు.

సర్వదాకృతజ్ఞుణ్ణిబాబూజీ అన్నాను.

సరే! ఈలా వచ్చి రాధపక్క నిలబడూ అన్నారు బెనర్జీబాబు. సిగ్గుతో పక్కపక్కన నిలబడ్డాం.

ఏం చక్కటి జంట అన్నారు బెనర్జీబాబు.

ఎంత నాటక మాడిందీ అనుకున్నా నేను.

★

# * ప్రశంస *

★

రచన:

రామవరపు వేణుగోపాలరావు

గీ॥ చిత్రమైనకథల చెల్వుతో నీవెపుడు
త్రచ్చు పెంపునందు ప్రాణతోడ
గుమ్ముగుమ్ముగాను కూర్చెదునవ్వలి
ప్త సమయమున నీవు తరచుగాను.

సీ॥ చిన్నారి పొన్నారి చిత్రంపు కథలతో
పరగుమా పత్రికా భవ్యముగను
వర్ధిల్లుమా! ఎప్డు వరగుణముల తోడ
పత్రికా రాజమా భవ్యముగను!
రంజిల్లుకథలతో రాణమీఱగనీవు
పరగుమా నీవెప్డు భవ్యముగను!
సాగుమా పత్రికా సరసంపు కథలతో
భవ్యమ్ముగా నీవు భావివైపు॥

గీ॥ దిక్కుదిక్కులకీర్తి చంద్రికలు నింపి
వరలుమాఆంధ్ర భూమిపైవరసగాను
సరసపత్రికా! నీవెపుడు సాగుమమ్మ
చిత్రమైనట్టిరీతిని చిత్రగుప్త!

★


## కస్తూరి మాత్రలు

జలుపు, సాధారణ శీతలముచేత దగ్గులు, జ్వరము, గొంతులో కరకరమని యుండుట తల భారము మొదలగువాటిని పోగొట్టును. ఈమాత్రలు బిడ్డలుమొదలు వృద్ధులువరకు ఎంత వయస్సుండినను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-కి రు. 1=00
తపాలా చార్జి రు. 1=12

ధనలక్ష్మి అండ్ కో.,
తపాల్‌పెట్టె నెం. 1376, మద్రాసు-1.